క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛపై దాడి అమానుషం



తహసీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

తాడిపత్రి: సెర్చ్ వారెంట్ లేకుండా గత గురువారం విజయవాడలో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లోకి పోలీసులు చొరబడి భయభ్రాంతులకు గురిచేయడం దారుణమని విలేకరులు మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రజాక్‌వలికి తాడిపత్రి నియోజకవర్గ విలేకరులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న సాక్షి పత్రికపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడటం అమానుషమన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛకు భంగం కల్గించడమే అన్నారు. కార్యక్రమంలో విలేకరులు మధు, చంద్రమోహన్‌రెడ్డి, ఆరోగ్యం, దిలీప్‌రాయల్, శ్రీనివాసులు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాసవీదేవికి పుష్పార్చన



పుష్పార్చనలో పాల్గొన్న దంపతులు

గుంతకల్లు: స్థానిక కన్యకాపరమేశ్వర దేవి ఆలయంలో నిర్వహిస్తున్న వాసవీ దేవి జయంత్యుత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారికి విశేష పుష్పార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం అనంతరం వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఉత్సవ విగ్రహాన్ని మండపంలో కొలువుదీర్చి వేదపడింతులు, అర్చకుల నేతృత్వంలో 108 మంది దంపతులచే పుష్పార్చన చేపట్టారు. సాయంత్రం విజయవిఠ్ఠల భజన మండలిచే పురందరదాసు కీర్తనలు, భగవద్గీత భక్తమండల సభ్యులచే పారాయణాలు ఆకట్టుకున్నాయి.

పాడి రైతులకు సబ్సిడీతో దాణా

గార్లదిన్నె: కరువు నివారణ చర్యల్లో భాగంగా పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశువుల దాణా అందజేస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 50 కిలోల పశువుల దాణా రూ.1,110 కాగా 50 శాతం సబ్సిడీతో రూ.555 పాడి రైతులు చెల్లిస్తే దాణా ప్యాకెట్ అందజేస్తామన్నారు. ఒక రైతుకు నెలకు ఒక బ్యాగు మాత్రమే ఇస్తామని, మూడు నెలల వరకూ దాణా అందజేస్తామన్నారు. దాణా కావాల్సిన రైతులు ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రల్లో పశు సంవర్ధక శాఖ సిబ్బందిని సంప్రదించి, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ మండల నాయకులు

గుంతకల్లు: దొనిముక్కలలో ఈ నెల 11 నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల అధ్యక్ష, సహాయ కార్యదర్శులు రామురాయల్, రామాంజినేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహాసభలకు సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరువుతారన్నారు. రైతాంగ సమస్యలపై ఈ మహాసభల్లో చర్చిస్తామనానరు. కావున రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఈశ్వరయ్య, ఉమర్‌బాషా, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులకు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

గుంతకల్లుటౌన్: గుంతకల్లు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బి.జయరామ్, బి.రమేష్ ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్ష, కార్యదర్శుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా జయరామ్, కార్యదర్శిగా రమేష్ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు సి.వెంకటేశ్వర్లు, ఎం.వీరవరప్రసాద్ తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎస్.వెంకటేశులు, స్పోర్ట్స్ సెక్రటరీగా తిమ్మప్ప, కోశాధికారిగా చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఎన్నికైన వారికి పోలింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

వసతులు లేక అవస్థలు

- ఇందిరమ్మ కాలనీపై అధికారుల చిన్నచూపు
- రోడ్డు, డ్రైనేజీలు లేక ఇబ్బందుల్లో ప్రజలు
- పది రోజులుగా తాగునీరు బంద్



ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు



ఇందిరమ్మ కాలనీలోని మట్టి రోడ్డులో రాళ్లు తేలిన దృశ్యం

గుంతకల్లు: పట్టణ శివారులోని దొనిముక్కల రోడ్డు వద్ద ఉన్న ఇందిరమ్మకాలనీలో మౌలిక వసతులు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేదలు నివసించే కాలనీలపై అటు కూటమి ప్రభుత్వం కానీ..ఇటు అధికారులు చిన్నచూపు ప్రదర్శిస్తుడంటంతో సమస్యలు తిష్ట వేశాయి. రోడ్డు, డ్రైనేజీలు లేకపోవడటంతోపాటు తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతోపాటు కాలనీ సమీపంలో ముళ్లపొదలు పెరిగి పాములు, విష పురుగులతో సావాసం చేసే పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు సరిగా లేక ప్రమాదాలు..

ఇందిరమ్మ కాలనీలో 2,000 వేలకు పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. కాలనీ గుంతకల్లు పట్టణంలోనే ఉన్నప్పటికీ గ్రామంగా మారింది. రోజూ కూలి పనులు చేసుకుంటే కానీ దొక్కాడని పరిస్థితి కాలనీ ప్రజలది. కేవలం నిరుపేదలనే ఉద్దేశ్యంతో మౌలిక వసతులు కల్పించడంతో అధికారులు అలసత్వం వహిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో సరైన రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నారు. ఎగుడుదిగుడుగా ఉండడంతోపాటు మట్టి, రాళ్లు తేలిన రోడ్డులో ద్విచక్రవాహనాల రాకపోకలకు, పాదచారులు తిరగడానికి ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాదారులు స్కిడ్ అయి గాయపడిన సంఘటనలు పలుమార్లు చోటు చేసుకున్నాయని వాపోయారు. ఇక చిన్నపాటి వర్షం వచ్చినా డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి వస్తోందన్నారు. ఇక కాలనీ సమీపంలోని ఖాళీగా ఉన్న స్థలాల్లో ముళ్లపొదలు పెరిగి పాములు, విష పురుగులు ఇళ్లలోకి చొరబడుతున్నాయని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇది ఇలా ఉండగా కాలనీ పైపులైన్లు తరచూ లీకవుతుండంతో వారానికి ఒకసారి మాత్రమే తాగునీళ్లు వస్తున్నాయి. పట్టణంలో పైప్ లైన్లు కొత్తవి ఏర్పాటు చేస్తుండటంతో గత పది రోజులుగా కొళాయిలకు నీరు రావడం లేదన్నారు.

పది రోజులుగా నీళ్లు రాలేదు..



పది రోజులుగా కొళాయిలకు నీరు రాలేదు. నీళ్లు వదిలే వారిని ఈ విషయం ప్రశ్నించగా పైప్‌లైన్ మరమ్మతుల వల్ల నీళ్లు వదలలేదన్నారు. కాలనీలో బోర్లు లేకపోవడంతో వందలాది రూపాయలు ఖర్చు చేసి నీళ్లు తెప్పించుకుంటున్నాం. రోజు కూలికి వెళ్తే కానీ ఇళ్లు జరిగిన పరిస్థితిల్లో తాగునీటి కోసం కూడా ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది.
– పార్వతి, ఇందిరమ్మ కాలనీ, గుంతకల్లు

పలువురు గాయపడ్డారు



మా ఇంటి ముందు బండరాళ్లు, మట్టితో రోడ్డు ఉండటంతో ద్విచక్రవాహనాదారులు, పాదచారులు జారి పడుతున్నారు. వర్షం వచ్చిన సమయంలో ఇంకా ఎక్కువ ప్రమాదాలు జరుగుతాయి. కొన్ని రోజుల క్రితం ఓ వృద్ధుడు కిందకు పడి మృతి చెందాడు. అధికారులు స్పందించి ఎగుడు, దిగుడు ఉన్న రోడ్డును బాగు చేసి సిమెంట్ రోడ్డు వేయాలి.
– సుజాత, ఇందిరమ్మ కాలనీ, గుంతకల్లు

ఇళ్లలోకి పాములు వస్తున్నాయి..



కాలనీ సమీపంలోని ఖాళీ స్థలాల్లో పెరిగిన ముళ్ల పొదల కారణంగా పెద్ద పెద్ద పాములు ఇళ్లలోకి వస్తున్నాయి. వేసవి కాలంలో కావడంతో రాత్రిళ్లు ఎక్కువగా కరెంటు తీస్తున్నారు. దీంతో రాత్రిపూట వృద్ధులు, పిల్లలు, మహిళలు బయటకు రావాలంటే పాములు, తేళ్లు ఇతర విష పురుగులతో భయాందోళన చెందుతున్నాం.
– సుంకలమ్మ, ఇందిరమ్మకాలనీ వాసి, గుంతకల్లు

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

యల్లనూరు: మండలంలోని నిరుద్యోగులకు రూడ్ సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సెల్ ఫోన్ రిపేరిలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కల్గి ఉన్న 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తులు అర్హులన్నారు. మే 15 నుంచి జూన్ 30 వరకూ 45 రోజుల పాటు సెల్‌ఫోన్ రిపేరీలో అనంతపురంలోని రూడ్ సెట్ సంస్థ కార్యాలయంలో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణతో పాటు ఉచితంగా భోజనం, వసతి ఏర్పాటు చేస్తారన్నారు. అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శుభకార్యం

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో శుక్రవారం జరిగిన వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. గ్రామంలో జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చంద్రయ్య కుమారుడి వివాహానికి మాజీ ఎమ్మెల్యే, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, పట్టణ కన్వీనర్ కప్పలబండ మధుసూదన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, జెడ్పీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్‌యాదవ్, హుస్సేన్‌పీరా, రాజన్న, కొత్తపల్లి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి పదోన్నతి

యల్లనూరు: మండలంలోని శింగవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహిం గ్రేడ్ –2 పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతిపై అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారని డిప్యూటీ ఎంపీడీఓ మనోహర్‌బాబు శుక్రవారం తెలిపారు. గతంలో గ్రేడ్–3 పంచాయతీ కార్యదర్శిగా గత కొన్ని నెలలుగా పనిచేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

తాడిపత్రి: రూరల్ పరిధిలోని తేరన్నపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకూ తాడిపత్రి పట్టణంతో పాటు రూరల్ పరిధిలోని తేరన్నపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఏరియాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వ్యక్తి మృతి



రవీంద్రనాయుడు (ఫైల్)

గార్లదిన్నె: మండల పరిధిలోని పాత కల్లూరుకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రవీంద్రనాయుడు (51) అనే వ్యక్తి గురువారం కుమారుడుతో కలసి ద్విచక్రవాహనంలో పామిడికి వెళ్తూ, పెన్నానది బ్రిడ్జి సమీపంలో ద్విచక్రవాహనం బోల్తాపడడంతో రవీంద్రనాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రున్ని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలిస్తుండగా అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో రేకుల షెడ్ దగ్ధం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సీఐటీయూ కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుని కేసరి రాణి అనే పేద మహిళకు చెందిన రేకులషెడ్ దగ్ధమైంది. దీంతో రూ.2 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. బాధితురాలి వివరాల మేరకు.. పెళ్లిళ్లల్లో వంట పనిచేస్తూ జీవనాన్ని సాగిస్తున్న ఆమె భర్త ఇటీవల మృతిచెందాడు. ఆమెకు ముగ్గురు కుమార్తెలున్నారు. రోజూ మాదిరిగానే ఇంటికి తాళం వేసి వంటపనికి వెళ్లింది. రేకులషెడ్ వెనుకాల ముళ్లకంపలకు గుర్తు తెలియని దుండగులు నిప్పటించడంతో.. ఆ మంటలు వ్యాపించి షెడ్ కాలిపోయింది. దీంతో ఇంట్లోని బీరువాలో భద్రపరుచుకున్న 15 తులాల వెండి, రూ.20 వేల నగదు, దుస్తులు, టీవీ, ఫ్యాన్లు, ఇతర సామగ్రితో పాటు తిండిగింజలు బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలార్పారు. ప్రమాదం జరిగిన ఇంటిని రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. నిరుపేద మహిళ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి తదితరులు కోరారు.

జవాన్ వీర మరణం గర్వకారణం

గుంతకల్లు/గుంతకల్లుటౌన్: భారత్–పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన భారత సైనికుడు మురళీనాయక్ చూపిన ధైర్యసాహసాలు తెలుగుజాతికే గర్వకారణమని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. యుద్ధభూమిలో మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వీరమరణం పొందిన సైనికుడి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. జవాన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందడం బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్, వైఎస్సార్‌సీపీ గిరిజన సంఘం నాయకులు ఎన్.గోవిందునాయక్ అన్నారు. ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. జవాన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పామిడి: పాక్ దాడిలో వీరజవాన్ మురళీ నాయక్ మృతిపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పీసీ రత్న రాజు, వీ బుజ్జిబాబు, పీ అనిల్‌కుమార్‌రాజా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్ ఆత్మకు శాంతికి చేకూరాలని వారు ప్రార్థించారు.

రామరాజుపల్లికి చేరిన బండిశూల రథం



పామిడి మండలం రామరాజుపల్లిలో రథం లాగుతున్న దృశ్యం

పామిడి/పెద్దవడుగూరు: పామిడి మండలంలోని రామరాజుపల్లి తిరునాలలో భాగంగా గత బుధవారం అట్టహాసంగా బయలుదేరిన బండిశూల రథం శుక్రవారం తిరిగి గ్రామానికి చేరింది. ఈ సందర్భంగా గ్రామదేవతలైన సుంకులమ్మ, ముత్యాలయ్య విగ్రహాలను ఊరేగించారు. సాయంత్రం రామరాజుపల్లి నుంచి కాశేపల్లి మీదుగా గుత్తి–అనంతపురానికి రథాన్ని లాగి, వృషభరాజుల గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా తిరిగి గుత్తి–అనంతపురం గ్రామానికి రథం బయలుదేరడంలో భాగంగా గ్రామదేవతలకు గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భక్తిప్రపత్తులతో దేవతామూర్తులకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తిరిగి గుత్తి–అనంతపురం నుంచి 11వ తేదీ రామరాజుపల్లికి బండిశూల రథం చేరడంతో ఈ తిరునాళ్ల ముగుస్తుంది. తిరునాళ్ల ముగింపురోజున దేవతామూర్తులకు మూగజీవాలను బలిస్తారు. అతిథులను ఆహ్వానించి మాంసాహార విందు భోజనాలను ఏర్పాటు చేసి, ఆనందోత్సాహాల నడుమ తిరునాలను ముగిస్తారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



గుంతకల్లులో కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు



తాడిపత్రిలో మాట్లాడుతున్న కిశోరి వికాసం కమిటీ సభ్యులు

గుంతకల్లు రూరల్/తాడిపత్రి రూరల్/గార్లదిన్నె: బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలిగే ప్రమాదం ఉందని ఐసీడీఎస్ అధికారిణి వెంకటేశ్వరి సూచించారు. శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని కసాపురం రోడ్డులో ఉన్న మారుతీ నగర్, ఎస్‌ఎస్‌బీ కాలనీల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో బాలికల భవిష్యత్ కోసం కిశోరి వికాసం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల మనోవికాసానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉన్నత విద్య అభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాలు, వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కులు, పరిరక్షణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ సేఫ్టీ తదితర అంశాలపై బాలికలకు వివరించారు.

– తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీలో ఉన్న ఆర్‌పీజీ మునిసిపల్ స్కూల్‌లో శుక్రవారం కిశోరి బాలికలకు బాల్య వివాహాలు, పునరుత్పత్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, 22వ వార్డు కౌన్సిలర్ హుస్సేన్ బాషా, మహిళా పోలీసు సాయివైష్ణవి, ఏఎన్‌ఎం ప్రవల్లిక, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

– గార్లదిన్నె మండలంలోని మర్తాడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమాశంకరమ్మ, కిశోర బాలికలు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట చేస్తున్న అర్చకుడు బ్రహ్మదత్త



కలశానికి పూజలు చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అనంతపురం–తాడిపత్రి రహదారి పక్కన శ్రీహరి హర అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రూ.3 కోట్లతో అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణం చేపట్టారు. శబరిమల నుంచి ప్రధాన అర్చకుడు బ్రహ్మదత్త విచ్చేసి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో గణపతి హోమం, శయ్యయిల్ పూజ, మరప్పాణి ప్రతిష్ట, అష్టబెంద లేపనం, కలశాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే యామినీబాల, మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం ఎదుట అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు 'ఉద్యోగుల సంఘం' ఎన్నికలు

గుత్తి: పట్టణంలోని ఎండీఓ కార్యాలయంలో శనివారం ఏపీ ఉద్యోగుల సంఘం గుత్తి తాలూకా ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపీనాథ్, గుత్తి ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఎల్లప్ప పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు ఎన్నికలు నిర్వహిస్తామని, ఉద్యోగులు హాజరు కావాలని వారు కోరారు.

శింగనమల: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శింగనమల తాలుకా సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించనున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ అధికారులుగా జిల్లా సహాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా కార్యనిర్వహణ అధికారి కేసీ నాగరాజును నియమించామన్నారు. ఎన్నికల్లో ఉద్యోగులు పాల్గొనాలని ఆయన కోరారు.

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని రైతుసేవా కేంద్రం, తిప్పారెడ్డిపల్లి, కర్నూల్ వెంచర్‌లో శనివారం ఏపీ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ శుక్రవారం తెలిపారు. ఎన్నికల అధికారులుగా వేణుగోపాల్, నాగరాజును నియమించామన్నారు. ఉద్యోగులు ఎన్నికల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

గాయపడిన వ్యక్తికి చేయూత

గుత్తి: బండి శూల తిరుణాలలో గాయపడిన వ్యక్తికి వైఎస్సార్‌సీపీ నాయకులు చేయూతనిచ్చారు. వివరాలు.. గుత్తి అపురం గ్రామ సమీపంలో గురువారం జరిగిన బండి శూల తిరుణాలలో వెంకటాంపల్లికి చెందిన రాజు ఎద్దుల బండి మీద నుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. రాజును అనంతపురం ఆస్పకి తరలించారు. సమాచారం తెలుకుసున్న గుత్తికి చెందిన వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకురాలు హేమలత , ఆర్మీ నాగిరెడ్డి, గోపీనాథ్ రెడ్డి, ఆర్మీ మోహన్, జయ ప్రకాష్ తదితరులు శుక్రవారం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న రాజును పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. అండగా ఉంటామని, అధైర్య పడవద్దని భరోసా కల్పించారు.

● నిరుపయోగంగా గోదాము



పిచ్చి మొక్కల నడుమ వ్యవసాయ గోదాము

పుట్లూరు: మండలకేంద్రానికి సమీపంలో ఏడేళ్ల క్రితం రూ.25లక్షల వ్యయంతో నిర్మించిన వ్యవసాయ గోదాము నిరుపయోగంగా మారింది. ప్రత్యేక ప్యాకేజీ అభివృద్ధి నిధులతో నిర్మించిన ఈ గోదామును అప్పటి ఎమ్మెల్యే యామినీబాల ప్రారంభించారు. అయితే వాహనాలు వెళ్లడానికి రోడ్డు లేకపోవడంతో గోదాము చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం స్పందించి వ్యవసాయ గోదాము వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

● ట్రాఫిక్ కష్టాలు



గుత్తి ఆర్‌ఎస్‌లో ట్రాఫిక్‌లో చిక్కుకున్న బస్సు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని మెయిన్ బజారులో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గతంలో ఇద్దరు పోలీసులు ట్రాఫిక్‌లో ఉండేవారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూసేవారు. అయితే ఏడాది కాలంగా ఒక్క పోలీసు కూడా ట్రాఫిక్ డ్యూటీలో ఉండటం లేదు. దీంతో వాహనదారులు ఇష్టానుసారం డ్రైవ్ చేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సెలవులో మునిసిపల్ కమిషనర్

తాడిపత్రి రూరల్: మునిసిపల్ కమిషనర్ శివరామకృష్ణ ఈ నెల 10 నుంచి 25వ తేదీ వరకూ సెలవుపై వెళ్లారు. కుమారుడి వివాహం నిమిత్తం ఆయన 15 రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో డీఈ రాంప్రసాద్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు.